క్లుప్తంగా

నెల రోజుల పాటు పోలీస్ యాక్ట్

ఎస్పీ పరితోశ్ పంకజ్



సంగారెడ్డి జోన్: శాంతి భద్రతల నేపథ్యంలో నెల రోజుల పాటు (నేటి నుంచి జూలై 31 వరకు) 30, 30(ఎ) పోలీసు యాక్ట్–1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించొద్దని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగేలా, ప్రజాధనానికి నష్టం కల్గించే, ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టరాదన్నారు. అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహిస్తే చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రయాణికుల సమస్యలను పరిష్కరిస్తాం

ఆర్టీసీ డిపో మేనేజర్ ఉపేందర్



సంగారెడ్డి టౌన్: ప్రయాణికులు నుంచి వచ్చిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఆర్టీసీ డిపో మేనేజర్ అన్నారు. సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కార్యక్రమానికి 16 మంది ప్రయాణికులు వారి సమస్యలను తెలియజేశారు. శంకర్‌పల్లి నుంచి సంగారెడ్డికి ఉ. 6 గంటల సమయంలో బస్సులో నడిపించాలని శంకర్‌పల్లి నుంచి కిషోర్, కార్తీక్ అన్నారు. మాందాపురం నుంచి అంజయ్య మాట్లాడుతూ.. కొండాపురం మాందాపురం గంగారం మీదుగా ఉ.9 గంటలకు ఒక ట్రిపు నడపాలన్నారు. రేగోడ్ నుంచి సంగారెడ్డికి బస్సులు నడపాలని భూమిరెడ్డి అన్నారు. పలువురు ప్రయాణికులు వారి సమస్యలను తెలియజేశారు. త్వరలోనే పరిష్కరిస్తామని డిపో మేనేజర్ తెలిపారు.

వాగుపై వంతెన నిర్మాణం



వంతెన నిర్మించుకుంటున్న రైతులు

నారాయణఖేడ్: మండలం పరిధి నర్సాపూర్‌కు చెందిన 32 మంది రైతులకు సంబంధించిన పొలాలకు వెళ్లాలంటే మధ్యలో వాగు ఉంది. పొలాలు దున్నడానికి ట్రాక్టర్‌ను తీసుకెళ్లాన్నా, ఎరువుల బస్తాలు తీసుకెళ్లాలన్నా, కూలీలను తీసుకెళ్లాలన్నా, పండిన ధాన్యాన్ని ఇంటికి తెచ్చుకోవాలన్నా వర్షాకాలంలో రైతులు నానా అగచాట్లు పడాల్సిన పరిస్థితి. దీంతో రైతులు పొలాలకు వెళ్లడానికి సొంతఖర్చుతో వాగుపై వారధిని నిర్మించుకోవాలని నిర్ణయించుకున్నారు. సోమవారం వారధి పనులకు శ్రీకారం చుట్టారు. వాగులో సిమెంటు పైపులు వేసి వాటి పైనుంచి ట్రాక్టర్లు, వాహనాలు పొలాలకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేలా పనులు చేపట్టారు.

కృతిమ ఇసుక సీజ్



అక్రమంగా తవ్వకాలు చేసిన
ఇసుక సీజ్ చేసిన తహసీల్దార్

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం మంగాపూర్ గ్రామ శివారులో అక్రమంగా తయారు చేస్తున్న కృత్రిమ ఇసుకను సోమవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ పర్వీన్ షేక్ తెలిపారు. చెరువు సమీపంలో మట్టి తవ్వకాలు చేసి ఇసుక తయారు చేస్తూ లారీల్లో ఇతర ప్రాంతాలకు అమ్ముకుంటున్నారన్న సమాచారంతో దాడి చేసినట్లు తహసీల్దార్ చెప్పారు. గతంలో కూడా సీజ్ చేసినట్లు వివరించారు. మళ్లీ తయారు చేయడం మొదలు పెట్టడంతో దాడులు చేసి ఐదు టిప్పర్ల సామర్థ్యం కలిగిన ఇసుకను సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన ఇసుక చోరీ కాకుండా పంచాయతీ కార్యదర్శికి పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించామన్నారు. అక్రమంగా ఇసుక రవాణా, మట్టి తవ్వకాలు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా న్యాయస్థానం జైలుశిక్ష, జరిమానా విధించిన సంఘటన పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి సంగారెడ్డి పాత బస్టాండ్, జాతీయ రహదారి, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఐదుమందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఇద్దరికి రెండు రోజులు జైలుశిక్ష, మిగతా ఇద్దరికి రూ.2000, ఒకరికి రూ. 1000, చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ఉపాధిలో పశువుల పాకలు

- జాబ్ కార్డులు ఉన్న వారికే అవకాశం
- అందోల్‌లో 24 యూనిట్లు మంజూరు



తాలెల్మలో నిర్మిస్తున్న పాక

జోగిపేట(అందోల్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం వ్యవసాయ పొలాల్లో పశువుల కొట్టాలతో పాటు మేకలు, గొర్రెల షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకందారులకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. ఉపాధి హామీలో జాబ్‌కార్డు ఉన్న వారిని అర్హులుగా గుర్తించి పశువుల కొట్టాల నిర్మాణానికి రూ.85వేల మంజూరు చేస్తోంది. గొర్రెల సంఖ్య ఆధారంగా షెడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తుంది. పాడి రైతులు, పశువుల పాకల కోసం ముందుకు వచ్చేలా ఉపాధి హామీ అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

అందోల్ మండలంలో..

అందోల్ మండలంలోని అల్మాయిపేట, అన్నాసాగర్, బ్రాహ్మణపల్లి, చింతకుంట, కన్‌సాన్‌పల్లి, మన్‌సాన్‌పల్లి, నాదులాపూర్, కొడెకల్, నేరడిగుంట, రోళ్లపాడ్, పోతిరెడ్డిపల్లి గ్రామాలకు మంజూరు కాగా, అక్సాన్‌పల్లి, తాలెల్మ, చింతకుంటలో రెండు, కొడెకల గ్రామాల్లో మొత్తం ఐదు యూనిట్లు పూర్తయ్యాయి. మిగతా చోట్ల నిర్మాణంలో ఉన్నాయి. పశువుల పాకల నిర్మాణానికి ముందుకు వస్తే మరిన్ని యూనిట్లు మంజూరు చేస్తామని ఉపాధి హామీ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందాలన్నారు.



అక్సాన్‌పల్లిలో పూర్తయిన పశువుల పాక

దరఖాస్తు చేసుకునే విధానం

పశువుల కొట్టాలు, గొర్రెల షెడ్ల నిర్మాణానికి ముందుగా గ్రామ పంచాయతీ తీర్మానం అవసరం. అనంతరం ఉపాధి హామీ జాబ్‌కార్డు, ఆధార్ కార్డ్, సంబంధిత పశుసంవర్ధక శాఖ అధికారుల నుంచి జీవాలు ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. పెంపకందారుడికి వ్యవసాయ భూమి ఉన్నట్లుగా తహసీల్దార్ నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుని మండల పరిషత్ కార్యాలయ అధికారికి దరఖాస్తు అందించాలి. పరిశీలన అనంతరం ఉపాధి హామీ నుంచి జీవాల సంఖ్య ఆధారంగా యూనిట్ కేటాయించి నిధులు మంజూరు చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ పథకాలపై అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అర్హులు ఉపాధి హామీ సిబ్బంది ద్వారా పూర్తి వివరాలు తీసుకుంటున్నాం. పశువుల కొట్టాలు, గొర్రెలు షెడ్ల మంజూరులో అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. మండలంలో 24 యూనిట్లు మంజూరయ్యాయి.

– అందోల్, ఈజీఎస్ ఏపీఓ అర్చన

ప్రతి క్షతగాత్రుడికి మెరుగైన వైద్యం

కాంగ్రెస్ నేత నీలం మధు



పరిశ్రమ వద్ద మంత్రులతో నీలం మధు

పటాన్ చెరు: ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో సంభవించిన ప్రమాదం బాధాకరమని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం మంత్రులు దామోదర రాజానరసింహ, వివేక్ వెంకటస్వామి, జిల్లా అధికారుల వెంట ప్రమాదస్థలాన్ని పరిశీలించారు. వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాదం సంభవించిన వెంటనే అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టారని వివరించారు. గాయపడిన 26 మందికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, పటాన్‌చెరు కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



కార్మికుడి ఓదారుస్తున్న చుక్కా రాములు

పటాన్‌చెరు టౌన్: కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్స్ పర్యవేక్షణ లేక.. నిర్లక్ష్యం వల్లనే పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. పాశమైలారం పారిశ్రామికవాడ సిగాచి పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగిన స్థలాన్ని ఆయన పరిశీలించి, క్షతగాత్రులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చనిపోయిన కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వడంతో పాటు గాయాల పాలైన వారికి తగిన ఎక్స్‌గ్రేషియా, మెరుగైన వైద్యం అందించాలన్నారు. పరిశ్రమల యజమానుల లాభాపేక్షతోనే రియాక్టర్లు పేలుతున్నాయన్నారు. అన్‌స్కిల్డ్ వర్కర్లతో రియాక్టర్ల వద్ద పని చేయించడం సరికాదన్నారు. ప్రమాదాలపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శిథిలాల కింద చిక్కిన వాళ్లను కాపాడేందుకు సహాయ చర్యలను వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట సీఐటీయూ జిల్లా నాయకులు కె.రాజయ్య, అతిమేల మాణిక్, రాజు ఉన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తేనే గుర్తింపు

మున్సిపల్ కమిషనర్ రవీందర్



కమిషనర్ తిరుపతిని సన్మానిస్తున్న దృశ్యం

జోగిపేట(అందోల్): జోగిపేట కమిషనర్‌గా తిరుపతి మంచి పేరు సంపాదించారని, భవిష్యత్తులో పట్టణ అభివృద్ధికి ఆయన సలహాలు, సూచనలు తీసుకుంటానని జోగిపేట కమిషనర్ రవీందర్ అన్నారు. సోమవారం కమిషనర్ తిరుపతి బదిలీ అయిన సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు విధుల్లో ఉన్నప్పుడు చేసిన సేవలే చిరస్థాయిగా గుర్తుండిపోతాయన్నారు. బదిలీ అయిన కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ.. తన హయాంలో మంత్రి దామోదర రాజనర్సింహ, కౌన్సిల్ సహకారంతో రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టగలిగానన్నారు. కమిషనర్ తిరుపతిని శాలువా పూలదండలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



బ్యాగులను పంపిణీ చేస్తున్న దశరథ్, తదితరులు

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని మండల విద్యాధికారి దశరథ్ పేర్కొన్నారు. గోటీలగుట్టలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయుడు బ్రిజేష్ కుమార్ తమ సొంత డబ్బులతో విద్యార్థులకు బ్యాగులు అందించడం అభినందనీయమన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పార్క్‌లో శుభ్రం చేస్తున్న కార్మికులు

నారాయణఖేడ్: వందరోజుల ప్రణాళికలో భాగంగా ఖేడ్ మున్సిపాలిటీలో సోమవారం మురుగు కాల్వల శుభ్రత, పిచ్చిమొక్కల తొలగింపు తదితర పనులు చేపట్టారు. 9, 10 వార్డుల్లో కాల్వల్లో తొలగించిన మురుగును ట్రాక్టర్ సహాయంతో తరలించారు. అలాగే, పలు కాలనీల్లోని మురుగు కాల్వలు, పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించారు. కమిషనర్ జగ్జీవన్, మేనేజరు వెంకటయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్ పనులను పర్యవేక్షించారు. మెప్మా విభాగం అధికారులు 20 మంది మహిళలకు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా లేని విషయాన్ని గుర్తించారు. దీంతో 10 మందికి ఒక సంఘం చొప్పున రెండు స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశారు.

పెన్షన్ మంజూరు చేయండి



వినతిపత్రం అందించేందుకు వచ్చిన గ్రామస్తులు

సంగారెడ్డి జోన్: ఇందిరమ్మ ఇళ్లతో పాటు పెన్షన్లను మంజూరు చేయాలని నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలంలోని బోర్గి గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఒంటరి మహిళలు, వితంతువులు, వృధాప్య ఫించన్‌లు అందకపోవటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అలాగే నివసించేందుకు ఇళ్లు లేక లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నామని, ఇండ్లు నిర్మించుకునేందుకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు సంజీవ్, సబిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు .. అండగా ఉంటాం

మునిపల్లి(అందోల్): అండగా ఉంటాం అధైర్య పడొద్దని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, గోపులారం మాజీ ఎంపీటీసీ పాండు బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పాడు. సోమవారం మండలంలోని చిన్నచల్మెడ గ్రామంలో ఇటీవల హమీద్ అనే వ్యక్తి విద్యుత్‌షాక్‌తో మృతి చెందారు. విషయం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర దృష్టికి తీసుకెళ్లడంతో హమీద్ కుటుంబానికి మంత్రి రూ. 20 వేల ఆర్థిక సహాయం చేశారని పాండు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై కత్తితో దాడి

జహీరాబాద్: మండలంలోని అర్జున్‌నాయక్ తండా పంచాయతీ కార్యదర్శి వీరేశంపై అదే గ్రామానికి చెందిన బాలుసింగ్ రాథోడ్ కత్తితో దాడి చేసినట్లు తండావాసులు, రూరల్ పోలీసులకు తెలిపారు. వివరాల ఇలా.. సోమవారం గ్రామ సమస్యల విషయమై కార్యదర్శి ప్రజలతో చర్చిస్తున్న క్రమంలో తండాకు సక్రమంగా నీరు రావడం లేదంటూ బాలుసింగ్ కత్తితో కార్యదర్శిపై దాడి చేయబోయాడని, ఈ క్రమంలో చేతిని అడ్డుపెట్టగా స్వల్పంగా గాయాలయినట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి పంపినట్లు తెలిపారు. బాధితుడు వీరేశం ఫిర్యాదుతో నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

కల్హేర్(నారాయణఖేడ్): రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ కోరారు. సోమవారం కల్హేర్ రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు విశిష్ట గుర్తింపు కార్డులు జారీ చేస్తుందని తెలిపారు. విశిష్ట గుర్తింపు కార్డులు ప్రమాణికంగా పని చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ సంతోష పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వట్‌పల్లి(అందోల్): మండలంలోని పల్వట్ల గ్రామానికి చెందిన చెల్మెట్టి సుప్రియకు రూ.45 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరయింది. సోమవారం కాంగ్రెస్ నాయకులు ఆమెకు అందజేశారు. వైద్యపరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ విధానం పరిశీలన

పుల్‌కల్(అందోల్): మండలంలోని మిన్‌పూర్ తండా ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ శంకర్ సోమవారం సందర్శించారు. పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ అమలు విధానం పరిశీలించారు. విద్యార్థుల రీడింగ్ స్కిల్, ఉపాధ్యాయుల డిమో క్లాసులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సివిల్‌రైట్స్ డే

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మహదేవుపల్లిలో సోమవారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. తహసీల్దార్ శివశ్రీనివాస్ మాట్లాడుతూ.. అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. అంటరానితనం పాటించవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మల్లేశం పాల్గొన్నారు.

డ్రగ్స్‌కి యువత బానిస కావొద్దు



తరగతి గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రమశిక్షణ కీలకమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరులో విద్యార్థుల సౌకర్యం కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూలై 15 నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు నియోజకవర్గంలోని పరిశ్రమల సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ విద్యాసంస్థల భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. డివిజన్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం డిగ్రీ కళాశాలలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో నాలుగు కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో నిర్మించిన 15 అదనపు తరగతి గదులను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దుతున్నామన్నారు. భవనాలతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించనున్నట్లు చెప్పారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్‌కి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, గ్రాండ్ ఫార్మా పరిశ్రమ సీఎస్ఆర్ హెడ్ రఘురామన్, పాల్గొన్నారు.

ఉద్యోగంలో పదవీ విరమణ సహజం



జహీరాబాద్ టౌన్: ప్రకాష్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు



న్యాల్‌కల్(జహీరాబాద్): జైపాల్‌రెడ్డికి జ్ఞాపికను బహుకరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

జహీరాబాద్ టౌన్: ఉద్యోగంలో పదవీ విరమణ సహజమని కెనరా బ్యాంక్ మేనేజర్ పట్లోళ అరవింద్‌కుమార్ అన్నారు. బ్యాంక్ ఉద్యోగి ప్రకాష్‌కుమార్ పదవి విరమణ చేసిన సందర్భంగా సోమవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వీస్‌లో బదిలీలు, పదవీ విరమణ సహజమైన ప్రక్రియ అన్నారు. ప్రకాష్ కుమార్ సుదీర్ఘకాలం బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఖాదాదారుల మన్నలను పొందారని అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఘనంగా సన్మానం

న్యాల్‌కల్(జహీరాబాద్): ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని, పదవిలో ఉన్నంతకాలం ఉత్తమ సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఎంఈఓ మారుతి రాథోడ్ అన్నారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో పని చేస్తున్న జైపాల్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా సోమవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి దంపతులను ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.



వట్‌పల్లి(అందోల్): ఎంపీడీఓ దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగులు

చేసిన సేవలతోనే గుర్తింపు

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో చేసిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ అన్నారు. వట్‌పల్లి ఎంపీడీఓ విధులు నిర్వహించిన శశిప్రభ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. సోమవారం రైతువేదిక భవనంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఉద్యోగిగా 36 ఏళ్ల పాటు ప్రజలకు సేవలందించి ఎలాంటి మచ్చలేకుండా ఉద్యోగ విరమణ పొందడం గర్వించదగిన విషయమని పలువురు అభినందనీయన్నారు. అనంతరం ఎంపీడీఓ దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

ఘనంగా హెచ్‌ఎం గ్రేస్ ఏంజలీనా వీడ్కోలు సభ



జ్ఞాపికను అందజేస్తున్న సహచర ఉపాధ్యాయులు

జిన్నారం (పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో 28 సంవత్సరాల పాటు సేవలందించిన చెట్ల పోతారం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గ్రేస్ ఏంజలీనా సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో మండల ఇన్‌చార్జి ఈఓ కుమారస్వామి పాల్గొని మాట్లాడారు. విద్యారంగంలో నాణ్యమైన విద్యను అందిస్తూ.. అంకితభావంతో ఏంజలీనా పని చేశారని కొనియాడారు. ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత స్థానాల్లో నిలిపిన గొప్ప మార్గదర్శకులు అన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓతో కలిసి గ్రామ మాజీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశంచారి హెచ్‌ఎం గ్రేస్ ఏంజలీనా దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం

జిల్లాలో పలుచోట్ల సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారుల వెంట వర్షం నీరు నిల్వడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. వర్షం కోసం ఎదురు చేస్తున్న పత్తి రైతులు సంతోషం వ్యక్తం చేశారు.



ప్రధాన రహదారిపై ట్రాఫిక్



న్యాల్‌కల్ మండల పరిధిలోని హద్నూర్‌లో కురుస్తున్న వర్షం



జహీరాబాద్ టౌన్: మల్‌చల్ గ్రామ పరిధిలో పడుతున్న వాన